క్లుప్తంగా

అడ్వయిజరీ బోర్డు సభ్యుడిగా పరమేష్



తొగుట(దుబ్బాక): నెహ్రూ యువ కేంద్రం అడ్వయిజరీ బోర్డు జిల్లా సభ్యుడిగా మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన మండల పరమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, స్పోర్ట్స్ శాఖ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్రం సేవల్లో గ్రామీణ యువతను భాగస్వాములను చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, నెహ్రూ యువకేంద్రం డైరెక్టర్ నితీష్ కుమార్ మిశ్రాకు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రీడాకారులు సత్తా చాటాలి



క్రీడాకారులకు వాలీబాల్‌తో పాటు కిట్స్‌ను అందజేస్తున్న సందీప్

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటాలని సామాజిక సేవకుడు, సామాజిక సమరసతా వేదిక గజ్వేల్ డివిజన్ కన్వీనర్ కాశమైన సందీప్ అన్నారు. వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు సంతోష్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆదివారం వాలీబాల్, కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు శిక్షణలో మెలకువలు నేర్చుకొని ఆటల్లో రాణించాలన్నారు. క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు.

ఆపన్నహస్త మిత్రబృందం చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి ఆపన్నహస్త మిత్రబృందం చేయూతనందించింది. సిద్దిపేట సమీప ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన సిరిసిల్ల సాయిచరణ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గజ్వేల్‌కు చెందిన ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు తమ 83వ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయిచరణ్‌కు రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆపన్నహస్త మిత్రబృందం అధ్యక్షుడు బాల్‌చంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి కొల్లూరి శ్యామ్‌ప్రసాద్, సభ్యులు కొలిచెలిమె స్వామి, రవికుమార్, సత్యనారాయణ, కృష్ణ, శ్రీకాంత్, గిరిబాబు, అనిల్, శ్రీకాంత్, సర్పంచ్ రవిగౌడ్, ఎంపీటీసీ ప్రశాంత్‌గౌడ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక



కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం బ్రాహ్మణ వివాహ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిచయ వేదికలో 250 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో బల్వంతరావు, అమిత్‌దేశ్‌పాండే, అశోక్‌రావు, రాధాకృష్ణశర్మ, శ్రీనివాస్‌రావు, కోటి రామేశ్వర్‌రావు, రాజుశర్మ, సోమసుందర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాలని ఆదేశించడంపై హర్షం

హుస్నాబాద్: కుల గణన చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడం పట్ల కాంగ్రెస్, బీసీ సంఘాల నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మేలు జరిగే కులగణన చేపట్టాలని సీఎం సంచలన ప్రకటన చేశారన్నారు. యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని నోటిఫికేషన్ ప్రకటించడం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటన నిరుద్యోగులకు భరోసా ఇచ్చిందన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

- రహదారుల్లో ఏర్పాటు చేయని సూచిక బోర్డులు
- ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించని వాహనదారులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న సంబంధిత శాఖ అధికారులు



ప్రమాద హెచ్చరిక బోర్డులేని మిరుదొడ్డి కొండాపూర్ మూల మలుపు

మిరుదొడ్డి(దుబ్బాక): రహదారుల్లోని మూల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. సూచిక బోర్డులు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల్లో రోడ్లను కమ్మేస్తూ ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్ల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదు. ఆ వాహనాలను తప్పుకునే క్రమంలో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దీంతో అడపాదడపా ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నాయి. ప్రమాదాల్లో గాయపడ్డ వాహనదారులు ఆసుపత్రుల పాలై ఆర్థికంగా చితికి పోతున్నారు. ఒక్కోసారి ప్రమాద తీవ్రతతో వాహనదారుల ప్రాణాలు సైతం గాలిలో కలిసిపోయిన సందర్భాలు ఉన్నాయి. అయితే వర్షాకాలంలో కురిసిన వర్షాల కారణంగా రోడ్ల కిరువైపులా చెట్లు, ముళ్లపొదలు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు.

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

సంబంధిత శాఖ మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని కొండాపూర్, అందె, చెప్యాల, అల్వాల, మల్లుపల్లి, ధర్మారం, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం, మోతె, వీరారెడ్డిపల్లి, జంగపల్లి, అల్మాజీపూర్, మూలమలుపుల వద్ద ప్రమాద హెచ్చరికలను సూచించే బోర్డులు లేక పోవడంతో వాహనా ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ దారుల్లో వాహనాలు నడపాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలకు కేంద్ర బిందువులుగా మారిన మూల మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఉమ్మడి మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మలుపు సమీపంలోకి వచ్చే వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదు. దీంతో వాటిని తప్పుకునే క్రమంలో అకస్మాత్తుగా బ్రేకులు వేస్తుండటంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మల్లన్నగారి భిక్షపతి, రుద్రారం

చోద్యం చూస్తున్న అధికారులు



ప్రమాదాలకు నిలయంగా మారిన మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అడపాదడపా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. ఇకపై అధికారులు మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

– జిగిరి అమర్, కొండాపూర్ ఉప సర్పంచ్

నేడు మంత్రి పర్యటన

హుస్నాబాద్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొత్తగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనుల శంకుస్థాపనల నిమిత్తం సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజవకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆయా గ్రామాల్లో పర్యటిస్తారు. సైదాపూర్ మండలం అరపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం గొడిశాల నుంచి గుజ్జుల పల్లె వరకు నిర్మించబోయే పంచాయతీ రాజ్ బీటీ రోడ్ పనులకు శంకుస్థాపన, భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో పల్లె దవాఖానాను ప్రారంభిస్తారు. అలాగే బొల్లోనిపల్లె నుంచి గట్ల నర్సింగాపూర్ వరకు, భీమదేవరపల్లి మండల కేంద్రం నుంచి చంటాయపల్లి వరకు నిర్మించే బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. తర్వాత మల్లారంలో కొత్తగా నిర్మించబోయే నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం అక్కన్నపేటలో వాటర్ ట్యాంక్, పల్లె దవాఖాన వాటర్ ట్యాంక్, రేగొండ, జనగామలో వాటర్ ట్యాంక్‌లు, అంతకపేటలో ఐకేపీ భవనం, ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అంతకపేట నుంచి గుబ్బడి వరకు నిర్మించబోయే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే హుస్నాబాద్ మండలం పందిల్లలో పల్లె దవాఖానను ప్రారంభిస్తారు. రాములపల్లె, వంగ రామయ్యపల్లెల్లో గ్రామ పంచాయతీ భవనాలు, వాటర్ ట్యాంక్‌లను మంత్రి ప్రారంభించనున్నట్లు మంత్రి కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ దీపక్ తదితరులు

డాక్టర్ దీపక్

దుబ్బాక: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి నుంచి తెలుసుకున్న తప్పులను సరిచేసుకుంటూ జీవితంలో ముందుకు సాగాలని డాక్టర్ బచ్చు దీపక్ అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో డాక్టర్ బచ్చు పద్మనాభం స్మారకార్థం నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలు ఆదివారం జరిగాయి. తుది పోరులో దుబ్బాకకు చెందిన లక్ష్మణ్, అరవింద్ జట్టు, శ్రీనివాస్, ప్రశాంత్ జట్టుపై విజయం సాధించింది. మొదటి స్థానంలో నిలిచిన లక్ష్మణ్ జట్టుకు డాక్టర్ దీపక్ రూ.5,555తో పాటు ట్రోఫీని అందజేశారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన శ్రీనివాస్ జట్టుకు రూ.3,333తో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బంగారయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు రమణ, సంతోష్, శ్రీకాంత్, అరుణ్, అష్రాఫ్, స్వామి, వేణు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు కిట్లను అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

బాలవికాస సేవలు మరువలేనివి

హుస్నాబాద్: బాలవికాస సేవా సమితి పేదలకు అందిస్తున్న సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో బాలవికాస సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వితంతువులకు చీరలు, దివ్యాంగులకు బ్యాగులు, నోట్ బుక్స్, నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ బాలవికాస సమితి వ్యవస్థాపకురాలు బాలక్క లండన్‌లో స్థిరపడినా స్వరాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలవికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ చిత్తారి పద్మ, బాల వికాస వాటర్ ఫెడరేషన్ సభ్యులు బంక చందు, వెన్నరాజు, మాడిశెట్టి శ్రీధర్, బాల వికాస మహిళా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్‌గా కనకయ్య



నియామకపత్రం అందుకుంటున్న కనకయ్య గౌడ్

సిద్దిపేటరూరల్: పుల్లూరు శ్రీలక్ష్మీ నరసింహస్వామి బండక్షేత్రం దేవస్థానం చైర్మన్‌గా కనకయ్యగౌడ్‌ను నియమిస్తూ ఆదివారం సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ నియామక పత్రం అందజేశారు. పుల్లూరు గ్రామానికి చెందిన కనకయ్య గౌడ్, ఒగ్గు యాదగిరి, ఐరేని దేవిరెడ్డి, బెస్తరాములు, గొడుగు రవి, పెద్దకర్రె కిష్టయ్య, వడాల కనకయ్యను డైరెక్టర్లు గా నియమించారు. ఈ సందర్భంగా కనకయ్యగౌడ్ మాట్లాడుతూ రాబోయే పుల్లూరు బండ క్షేత్రం జాతరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని, తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములు, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, రాజిరెడ్డి, శ్రీను, యూత్ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘నిఘా నీడలో రామవరం పాఠశాల’

సీసీ కెమెరాల అందజేత

సాక్షి స్పందన

అక్కన్నపేట(హుస్నాబాద్): డిసెంబర్ 28వ తేదీన సాక్షి దినపత్రికలో ‘మందుబాబులకు అడ్డాగా పాఠశాల’ శీర్షిక కథనం ప్రచురితమైంది. దీంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు స్పందించారు. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి కర్ణకంటి అశోక్ చారి సుమారుగా రూ.50 వేల విలువ కలిగిన మొత్తం ఎనిమిది సీసీ కెమెరాలను పాఠశాలకు బహూకరించారు. దీంతో అశోక్ చారిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.



కంట్రోల్ రూంలో పాఠశాలను పర్యవేక్షిస్తున్న దృశ్యాలు

ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి కూలీల హక్కులను కాపాడాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ నిధులు తగ్గించడం, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్), ఆధార్ బేస్డ్ వేతనాల చెల్లింపులను చేపట్టి ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘించిందని మండిపడ్డారు. రాష్ట్రంలో 52.9 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 35,630 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పనిదినాలు కల్పించారని ఆరోపించారు. చట్ట ప్రకారం 60:40 శాతం నిష్పత్తిలో వేతనాలు, మెటీరియల్ పనులకు నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మెటీరియల్‌ను 57 శాతం ఖర్చు చేసిందని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. రాజస్థాన్‌లో గత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పట్టణ ఉపాధి హామీ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశ పెట్టి గృహ, భవన నిర్మాణ రంగ కార్మికులకు, అసంఘటిత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కూలీలకు రూ. 5 లక్షల ప్రమాద బీమా, రూ. 10 లక్షల వైద్య బీమా కార్డులను అందించాలన్నారు. ఈ అంశాలపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

దేశవ్యాప్తంగా వాసవీ క్లబ్ సేవలు



మాట్లాడుతున్న క్లబ్ గవర్నర్ బానూరి నర్సింహులు

కొండపాక(గజ్వేల్): సామాజిక సేవ కోసమే వాసవీ క్లబ్ ఏర్పడిందని, దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆ సంస్థ గవర్నర్ బానూరి నర్సింహులు పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో వాసవీ క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా ఉప్పల రాజు, సెక్రటరీగా వేముల శివప్రసాద్, కోశాధికారిగా కాపర్తి రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కాచం నవీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండు, నాయకులు గంప శ్రీనివాస్, మాంకాల శ్రీనివాస్, గంగిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుగా ఇద్దరు ఎంపిక

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ హెల్త్ అండ్ మెడికల్ డిపార్ట్‌మెంట్ నర్సింగ్ ఆఫీసర్ స్టాఫ్ నర్సు ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. మండలంలోని మర్రిముచ్చాల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బాలకిషన్ గౌడ్, వినోద్‌కుమార్ మెరిట్ ఆధారంగా ఎంపికయ్యారు. వారిని గ్రామస్తులు అభినందించారు.

సాంస్కృతిక పరిమళాలు భావితరాలకు అందజేయాలి

విజయదుర్గ ఉపాసకుడు చెప్పెల హరినాథ శర్మ



మాట్లాడుతున్న విజయదుర్గ ఉపాసకుడు హరినాథ శర్మ

కొండపాక(గజ్వేల్): భారతీయ సాంస్కృతిక పరిమళాలను భావితరాలకు అందజేయాల్సిన అవసరం ఉందని విజయదుర్గ ఉపాసకుడు చెప్పెల హరినాథ శర్మ అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలోగల విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పరివార క్షేత్రాల కుటుంబ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణం కుటుంబ విలువలకు, సామాజిక సమరసతకు చక్కటి మార్గం చూపిందన్నారు. కుటుంబ సమ్మేళనాలతో మానవీయ విలువలు ద్విగుణీకృతమవుతాయన్నారు. సనాతన ధర్మం ప్రపంచానికి అందించిన కుటుంబ జీవన వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అయోధ్య రామాలయ కల నెరవేరిన సందర్భంగా కుల మత ప్రాదేశిక ఎల్లలను అతిక్రమించి రామభక్తి విశ్వవ్యాప్తమైందన్నారు. వ్యక్తి శ్రేయస్సు కంటే సమాజ శ్రేయస్సు ఉత్కృష్టమైందన్నారు. కార్యక్రమంలో విభాగ్ సంఘ్ చాలక్ మురళీధర్‌రెడ్డి, సంఘ్ నాయకులు ప్రవీణ్, రాఘవులు, బాల్‌రాజేశం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీగా అమలు చేస్తుంది



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల చిన్న శ్రీనివాస్

మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల చిన్న శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): గ్యారంటీ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం క్రమక్రమంగా అమలు చేస్తుందని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల చిన్న శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని దుద్దెడలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆదివారం మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటా సౌభాగ్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పంజ అఖిల్, బూర్గుల వెంకటరమణ, కొమ్ము మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**



అంజయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): మునగ కాయలు కోయడానికి చెట్టెక్కి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిర్రమైన అంజయ్య (48) దినసరి కూలీ. ఈనెల 23వ తేదీన తన పెద్ద కుమారుడి వివాహం సందర్భంగా గ్రామంలో రిసెప్షన్ ఏర్పాటు చేశాడు. వంటల తయారీలో వాడేందుకు గ్రామ పంచాయతీ సమీపంలోఉన్న మునగ కాయలు కోయడానికి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అంజయ్యను కుటుంబ సభ్యులు సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆదివారం తుది శ్వాస విడిచాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. దీంతో పెండ్లి ఇంట విషాదం నెలకొంది. మృతుడి కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ **హామీలన్నీ అమలు చేస్తాం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి రాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో గయాజుద్దీన్, రాకేష్, సంపత్, రాకేష్ రెడ్డి, రాకేష్ యాదవ్ పాల్గొన్నారు.



◆ **విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ**

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల మండలం కమలయపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల ఏర్పాటుకు ఆదివారం గ్రామ సర్పంచ్ ఓరుగంటి అంజయ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **సద్గురు సదనంలో ప్రత్యేక పూజలు**



చేర్యాల(సిద్దిపేట): శృంగేరీ నగర్‌లోని సద్గురు సదనంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆది శంకరమూర్తి విగ్రహ ప్రతిష్ఠ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శని, ఆదివారాలు రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. శనివారం అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ఆది శంకర మందిరం వరకు శోభాయాత్ర, ఆదివారం ఉదయం మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం నిర్వహించారు.

◆ **జీవితంలో యోగా ముఖ్యమే**

సిద్దిపేటజోన్: ప్రతీ ఒక్కరి జీవితంలో యోగా ముఖ్యమని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు రంగాచారి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో భవన్‌లో యోగా శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యోగా గురువులు మనోహర్, ట్రస్ట్ సభ్యులు మల్లేశం, శ్రీనివాస్, శ్రీహరి, రవి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

